నేటి దినపత్రిక

# సూర్య

18వ సంవత్సరం

www.suryaa.com

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

సోమవారం,9 డిసెంబర్ 2024 8 పేజీలు


## ఎమ్మెల్యే వివేక్‌ను కలిసిన శాసనమండలి చైర్మన్ మోసేన్ రాజు



**హైదరాబాద్/నర్సాపురం,మేజర్‌న్యూస్ :** ఇటీవలహైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో మాలల సింహగర్జన విజయవంతంగా నిర్వహించిన చెన్నూరు ఎమ్మెల్యే గెడ్డం వివేక్ వెంకటస్వామిని ఆదివారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోసేన్ రాజు కలిశారు. హైదరాబాద్‌లో వారి స్వగృహంలో కల్సి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారి ఇరువురు కొద్దిసేపు ముచ్చడించుకున్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల జాతి మొత్తానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని వారు అభిప్రాయపడ్డారు. సింహ గర్జనకు పెద్ద ఎత్తున మాలలు తరలిరావడం ఎస్సీ వర్గీకరణపై ఉన్న వ్యతిరేకత ఈ సభ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి అర్థం అవుతుందని వారు అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో దళిత చైతన్య వేదిక నాయకులు డొల్ల మార్టిన్,బత్తుల మురళీకృష్ణతదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన అందరికీ పక్కా ఇళ్లు

**- రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి**



**నూజివీడు,మేజర్‌న్యూస్:** అర్హులైన వారందరికీ ఇళ్ళు ఇవ్వాలన్నది రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనారా చంద్ర బాబు నాయుడు లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ,సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. నూజివీడు పట్టణ టూ వీలర్ మెకానిక్స్ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధికి మెకానిక్ యూనియన్ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రాష్ట్రమంత్రి పార్ధసారథి మాట్లాడుతూ మెకానిక్ యూనియన్ కమ్యూనిటీ హాల్ కోసం స్థల సేకరణ పై సమీక్షించి అనంతరం కమ్యూనిటీ హాలు నిర్మాణానికి ప్రయత్నం చేస్తానని చెప్పారు. అర్హులైన ప్రతి మెకానిక్ సోదరునకు పక్కా ఇళ్లు కట్టించే భాద్యత నాది స్పష్టం చేశారు. వచ్చే మార్చి నుండి హౌసింగ్ నిర్మాణానికి సుమారు రూ.3 లక్షల వరకు ప్రభుత్వ అందజేస్తుందని దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని పక్కా ఇళ్లు నిర్మించుకోవాలని మంత్రి సూచించారు. ఇళ్ళు కట్టుకొనే వారికి కేంద్ర ప్రభుత్వం నుండి రూ.25 లక్షల వరకు ఋణ సహాయం అందిస్తుందని దానిలో రూ.2 లక్షల వరకు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఇంటి నిర్మాణం చేపడితే తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుండి ఇళ్లను నిర్మించి అద్దెకు కూడా ఇచ్చే గొప్ప అవకాశం ఉందని ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 25 లక్షల ఇళ్లు కట్టించనున్నట్లు ఆయన వెల్లడించారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజనతో కలిపి ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. రానున్న 5 సంవత్సరాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్లు కట్టించే బాధ్యత నాది అని మంత్రి తెలిపారు. అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధిని యూనియన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు తెలుగుదేశం నాయకులు జగదీష్, దుర్గాప్రసాద్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

## ఆడపిల్లలను రక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉండాలి

**- 15న సేవ్ ద గరల్ చైల్డ్ 2కే రన్ : మంత్రి రామానాయుడు**



**పాలకొల్లు,మేజర్‌న్యూస్:** నేడు సమాజంలో ఆడపిల్లలను రక్షించు కోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆడపిల్లలను రక్షించుకుందాం.. భ్రూణ హత్యలు నిర్మూలిద్దాం. దాడులు, అత్యాచారాలు, హత్యలను అరికడదామనే నినాదంతో పాలకొల్లులో ఈనెల 15వ తేదీన జరగబోయే సేవ్ ద గర్ల్ చైల్డ్ 2కే కార్యక్రమాన్ని సమిష్టిగా విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. స్థానిక ఏఎంసి సమావేశాలలో ఆదివారం పాలకొల్లు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వివిధ వర్తక సంఘాల ప్రతినిధులతో, ప్రభుత్వ అధ్యాపకులు ఉపాధ్యాయులు యాజమాన్యా లతో వేరువేరుగా నిర్వహించిన సమావేశంలో మంత్రి రామానాయుడు పాల్గొన్నారు. ముందుగా 2కే రన్ కార్యక్రమా ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి రామా నాయుడు మాట్లాడుతూ శాసనసభ్యుడు అంటే ప్రభుత్వం చేసే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించడమే కాదని సామాజిక చైతన్య సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించాలనే ఉద్దేశంతో ధర్మారావు ఫౌండేషన్ ద్వారా పాలకొల్లు నియోజక వర్గంలో అనేక చైతన్య కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలను రక్షించు కోవాలనే నినాదంతో సేవ్ ద గర్ల్ చైల్డ్ రన్, మొక్కల నాటడం,సంక్రాంతి సంబరాలు, ఇంకుడు గుంతల యజ్ఞం,అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఏడాదిపాటు,క్రిస్మస్ వేడుకలు వంటి ఎన్నో కార్యక్రమాలు జరుపుతున్నామన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం కూడా స్థానిక గాంధీ బొమ్మలు సెంటర్ వద్ద తలపెట్టడం జరిగిందని, మంత్రి రామానాయుడు తెలిపారు. ఈ కార్యక్రమ విజయవంతనికి వర్తకులు సహకరించాలని కోరారు. వేదికపై చాంబర్ అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహారావు, సీతారామరాజు ,దేవరపు లక్ష్మీ నారాయణ, దీప్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం చైర్మన్ సుధాకర్ రావు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్, వెంకటరాజు





**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** చిన్న వెంకన్న ఆలయ అనువంశిక ధర్మకర్త ,చైర్మన్ రాజా సురానేని వెంకట సుధాకర్ రావు జన్మదిన వేడుకలు మైలవరం ఆయన స్వగ్రామంలో ఘనంగా నిర్వహించారు.

ఈ క్రమంలో మైలవరం శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్, గోపాలపురం శాసనసభ్యులు మద్దిపాటి వెంకటరాజు చైర్మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌ను కట్ చేశారు. అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో వసతి సౌకర్యం పథకం బ్రోచర్లు ఆవిష్క రించారు.

ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు నివృతరావు, కార్య నిర్వాహణాధి కారి సత్యనారాయణమూర్తి, ఈఈ భాస్కర్, దేవస్థానం అధికారులు తదితరులు పాల్గొన్నారు.





## పృథ్వీ శ్రీచక్ర పంచాయతన పూజలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**భీమవరం,మేజర్‌న్యూస్ :** శ్రీ మావుళ్ళమ్మ ఆలయములో ఆదివారం 'పృథ్వీ శ్రీ చక్రము" వేసి, శ్రీ చక్రార్చన పూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హైదరాబాద్ ,"నవగోపికా సంఘం" వారితో ఏర్పాటు చేయించడం జరిగినది. అనంతరం శ్రీదేవి ఖడ్గమాల, ఆ తదుపరి శ్రీలలిత సహస్ర నామ పారాయణం కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరిగింది. ఈ పూజ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి స్వయంగా పాల్గొన్నారు. ఈపూజల ప్రతి ఫలంగా జిల్లాకు అన్ని విధాల మంచి చేకూరుతుందని

- తరువాయి 2లో..

# లయన్ డాక్టర్ యార్లగడ్డ జగన్మోహనరావు మృతి



**ఏలూరు,మేజర్న్యూస్ :** లయనిజంలో అంతర్జాతీయ గుడ్ విల్ ఆఫ్ అంబాసిడర్ అవార్డు గ్రహీత,లయన్స్ పూర్వపు గవర్నర్,సేవామూర్తి, ఏలూరు నగరంలో ప్రజలు దేవుడు డాక్టర్గా ఆరాధించే లయన్ డాక్టర్ యార్లగడ్డ జగన్మోహన రావు (85) శనివారం రాత్రి స్వర్గస్తులయ్యారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉన్న డాక్టర్ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. హేలాపురి లయన్స్ క్లబ్ ద్వారా గత 48సంవత్సరాలుగా ఏలూరు ప్రజలకే కాక లయనిజం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖపట్నంలో లయన్స్ కాన్సర్ హాస్పిటల్ ఏర్పాటులో, విజయవాడలో లయన్స్ బ్లడ్ బాంక్ ఏర్పాటులో,దెందులూరులో లయన్స్ఐ.టి.ఐ, ఏలూరులో కె.ఏ.హెచ్.ఎల్. డిగ్రీ కళాశాల నిర్మాణంలో వీరి కృషి మరువలేనిది.

– పలువురి ప్రముఖుల సంతాపం –వీరి మృతికి హేలాపురి లయన్స్ క్లబ్ సభ్యులు,ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు,మానవత సంస్థ సభ్యులు, అభినయ నృత్యభారతి సభ్యులు,రోటరీ క్లబ్ సభ్యులు,వివిధ రంగాల ప్రముఖులు శాసన సభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, లయన్స్ అంతర్జాతీయ నాయకులు చిగురుపాటి వరప్రసాద్, లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణు బాబు,ఉప గవర్నర్లు పాపారావునాయుడు, డా.డి. సుబ్బారావు, రమేష్ హాస్పిటల్స్ చైర్మన్ మద్దిపాటి సీత రామమోహనరావు, ఉషా బాలకృష్ణ రావు,లయన్స్ పూర్వపు జిల్లా గవర్నర్లు పి.సుభాష్ బాబు, డా.పి.విజయ భాస్కరరెడ్డి, వేమా కోటేశ్వరరావు, శాసన మండలి సభ్యులు వంకా రవీంద్రనాధ్,పూర్వపు గవర్నర్లు గట్టిం మాణిక్యాలరావు, డాక్టర్ ఎం.వి.ఎస్.రాజు, డాక్టర్ బాబ్జీ,డా. వి.కె. పంకజాక్షన్,కె.వి.కిషోర్ కుమార్, దుర్గా మల్లేశ్వరరావు, గోపీనాథ్,ఐ.ఏం.ఏ. అధ్యక్షులు డా.దొంతం శెట్టి బసవరాజు, విశ్రాంత కళాశాలల అధ్యాపక సంఘం రాష్ట్ర నాయకులు ఎల్. వెంకటేశ్వరరావు, అభినయ నృత్యభారతి వ్యవస్థాపకులు నాట్యాచార్య దువ్వి హేమసుందర్, మానవత నిర్మల తదితరులు తమ సంస్థల ద్వారా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఎన్.ఎఫ్.ఐ. డబ్ల్యు. జాతీయ కౌన్సిల్ సభ్యురాలుగా మన్నవ యామిని



**ఏలూరు,మేజర్న్యూస్ :** భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) సభ్యురాలిగా మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని ఎన్నికైనట్లు ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరక శ్యామల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మన్నవ యామిని,మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, ఏలూరు జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు. జాతీయ మహిళా సమాఖ్య 22వ అఖిల భారత మహాసభలు 6,7,8, తేదీలలో దేశ రాజధాని ఢిల్లీలోని హెచ్.కె.ఎస్.ఎస్ హాలులో జరిగాయన్నారు.మూడు రోజులు జరిగే మహాసభ లో భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళికలు,చర్చలు, తీర్మానాలు ఆమోదించినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 23 మంది పాల్గొన్నట్లు తెలిపారు.ఈసందర్భంగా మన్నవ యామిని మాట్లాడుతూ చైతన్యవంత మైన యువతులు నాయకత్వం వహించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్లో కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని మధ్యాంధ్ర ప్రదేశ్గా మార్చిందని విమర్శించారు. రాష్ట్రంలో నిత్యావసర ధరలు భారం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న రోజులలో మద్యం నియంత్రణ, నిషేధం కోసం,పెరిగిన ధరల అదుపులో ఉంచడం కోసం మహిళా సమాఖ్య పోరాటాలను రూపొందిస్తుందని తెలిపారు.

## పృథ్వీ శ్రీచక్ర పంచాయతన పూజలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**మొదటిపేజి తరువాయి**

ఆకాంక్షించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి కి దేవస్థానం ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, దేవదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్ ఇ.వి సుబ్బారావు, ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, తనిఖీదారు వి.వెంకటేశ్వరావు, నవ గోపికా సంఘం ప్రతినిధులు కె.సుజాత, యు.నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి





**ఇరగవరం,మేజర్న్యూస్ :** ధాన్యనికి గిట్టుబాటు ధర కల్పించాలని రైతు సంఘ నాయకులు మద్దాల నాగేశ్వరావు కోరారు. గతఐదు సంవత్సరాలనుండి పంటలు సరిగా పండక దీనికి తోడు అకాల వర్షలవల్ల రైతులందరు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎరువులు, పురుగుమందులు ధరలు విఫరీతంగా పెరిగిపోయాయన్నారు.

ఎన్ని ప్రభుత్వాలు మారినా రైతు సంక్షేమానికి ఇటువంటి చర్యలు తీసుకోవడంలేదు అన్నారు. అరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించడానికి నానా కష్టాలు పడవలసీ వస్తుందని ధాన్యం లో తేమ పరీక్షలు చేయాలనీ తీవ్ర ఇబ్బందులకు గురించేస్తున్నారని వాపోయారు. అధికారులు ఈవిషయాన్ని గుర్తించి ధాన్యం కొనుగోలులో ఇటువంటి సిస్టమ్ లేకుండా చేసి రైతులను ఆడుకోవాలని పలువురు కోరుతున్నారు.

# హెూంగార్డుల పనితీరు ప్రశంసనీయం..13 మందికి సత్కారం




**భీమవరం,మేజర్ న్యూస్:** పోలీసు శాఖలో హెూంగార్డు ఆఫీసర్స్ పనితీరు ప్రశంసనీయమని, పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హెూంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు అమోఘమని వన్ టౌన్ సిఐ నాగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో హెూంగార్డ్స్ ఏర్పాటు దినోత్సవాన్ని నిర్వహించారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ వరదలు సంభవించినపుడు, ఎన్నికల సమయంలో రోజువారీ విధులలో హెూంగార్డ్ ఆఫీసర్స్ అంకిత భావంతో సేవలందిస్తున్నారని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలకు రక్షణ కల్పించడంతో బాధ్యతాయుతమైన సేవలు అందించడంతో పాటు పొరుగు రాష్ట్రాలలో ఎన్నికల బందోబస్తులో అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించారని వారి సేవలను కొనియాడారు. న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు మాట్లాడుతూ పోలీస్ శాఖలో పనిచేసే ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హెూంగార్డ్స్ ఏర్పాటు దినోత్సవాన్ని పురస్కరించుకుని విధులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 13 మంది హెూంగార్డ్స్ లను సత్కరించామని అన్నారు. కార్యక్రమంలో చల్లా రాము, గోపిశెట్టి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో కావిడ ఉత్సవం





**ద్వారకాతిరుమల,మేజర్న్యూస్:** చిన్న వెంకన్న ఆలయ ఉపాల యమైన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఆలయంలో షష్టి ఉత్సవాలు వైభవముగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం కావిడి ఉత్సవాన్ని అత్యంత వైభవముగా మేళతాళాలు మంగళ వాయిద్యాలు నడుమ గ్రామ పురవీధులలో నిర్వహించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిషష్టి కళ్యాణ ఉత్సవం అయిన మరుసటి రోజు కావిడ ఉత్సవం జరపటం ఇక్కడ సంప్రదాయంగా వస్తుందని పూజారి రాము తెలిపారు. కావిడ ఉత్సవానికి భక్తులు అధికంగా పాల్గొన్నారు.

## ధాన్యం రైతులకు హమాలీ చార్జీలు వెంటనే చెల్లించాలి



**ఏలూరు,మేజర్న్యూస్ :** ధాన్యం రైతులకు హమాలీ చార్జీలు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అన్నే భవనంలో వారు మాట్లాడుతూ జిల్లాలో రూ.3కోట్లకు పైగా హమాలీ చార్జీలు చెల్లించాల్సి ఉందన్నారు. ధాన్యం సొమ్ములు 48 గంటల్లో చెల్లిస్తున్నట్లు చెబుతున్న ప్రభుత్వం హమాలీ చార్జీలు ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గతంలో హమాలీ,రవాణా చార్జీలు రైతులకు సక్రమంగా అందలేదని అన్నారు. 80 శాతం పైగా ధాన్యం ఉత్పత్తి చేస్తున్న కౌలు రైతులపైనే హమాలీ, రవాణా చార్జీలు భారం పడుతుందని చెప్పారు. ఈ క్రాప్ లో భూ యజమాని పేరు ఉండటం వలన వారిపేరుతో ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రవాణా, హమాలీ చార్జీలు భూ యజమానుల బ్యాంక్ అకౌంట్ లలో ఆలస్యంగా జమ చేయడం వలన కౌలు రైతులకు చేరడం లేదన్నారు. ఇప్పటికైనా బకాయిగా ఉన్న హమాలీ చార్జీలు వెంటనే రైతులకు ఖాతాలకు జమ చేయాలని కోరారు.

## నేడు ఆదానీ కంపెనీ ఒప్పందాలను రద్దు కోసం ధర్నాలు

**ఏలూరు,మేజర్న్యూస్ :** అదానీ గ్రూప్ కంపెనీల అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని,గత రాష్ట్ర ప్రభుత్వం ఆదానీ కంపెనీలతో చేసుకున్న అన్ని ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా డిసెంబర్ 9సోమవారం అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సిపిఐ మండల పార్టీ కార్యదర్శులకు, జిల్లా సమితి సభ్యులకు సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు.

మణిపూర్లో జరుగుతున్న హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చ జరపాలని, అధిక ధరలను అరికట్టాలని, భారతదేశంలో నిరుద్యోగం నిర్మూలిం చాలని,రాష్ట్ర ప్రభుత్వ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ సిపిఐ శ్రేణులు నిరసన కార్యక్రమం చేపట్టి స్థానిక మండల తాశీల్దార్లకు వినతి పత్రాలు సమర్పించా లని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపును ఏలూరు జిల్లాలో అన్ని మండల కేంద్రాలలో జయప్రదం చేయుటకు పార్టీ నాయకత్వం బాధ్యత వహించాలని కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు.

# గురుకులాల్లో ఉపాధ్యాయులు లేరా ?

## - ఇంటికి పంపండి పొలం పనులకు పంపుతాం ?
## - గిరిజనులంటే అధికారులకు చిన్న చూపా?
## - గురుకులంలో నెల రోజులుగా ఉపాధ్యాయులు లేకపోతే ఎలా ?

**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్** : గురుకులంలో ఉపాధ్యాయులు లేరు విద్యార్థులు పాఠశాలలో ఎందుకు ఇంటికి పంపండి కనీసం కూలి పనులైన నేర్పించుకుంటాము అంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేరుకు గురుకుల పాఠశాలలు అక్కడ మాత్రం ఉపాధ్యాయులు ఉండరు విద్యార్థులకు నిలువెత్తు భవనాలు కడుపునిండా భోజనం పెట్టి గదులలో బందీలుగా ఉంచుతున్నారు. చదువు లేనప్పుడు విద్యార్థి భవనాల్లో ఉండి ఉపయోగమేమిటి కనీసం పొలం పనులు నేర్పితే భవిష్యత్తు అయిన ఉంటుంది అంటున్నారు పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు. పోలవరం నియోజకవర్గంలో ఐటిడిఏ పరిధిలో మూడు గురుకుల పాఠశాలలు ఉన్నాయి.ఆగురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు కరువయ్యారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం లో పాఠాలు నేర్చుకుని తమ పిల్లలు వస్తారని ఆశపడే తల్లిదండ్రులకు ఇది ఎంతో చేదు విషయం. గిరిజన విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి అంటూ ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు మైకుల ముందు ఉదర్ల కొడతారు తప్పా ఇన్ని రోజులు ఉపాధ్యాయులు లేకపోతే ప్రత్యామ్నాయ మార్గం చూపకుండా నిర్లక్ష్యం వహించటం నిరుపేద గిరిజన విద్యార్థులనే చులకన భావం అంటున్నారు.

– గిరిజన సంఘాలు ఏం చేస్తున్నాయి –ఎక్కడ సమస్య ఉన్నా గిరిజన సంఘాలు ఆందోళన చేపడుతుంటాయి. అయితే ఐటిడి పరిధిలో మూడు గురుకులాలలో 25 రోజులుగా ఉపాధ్యాయులు లేక వేలమంది విద్యార్థులకు చదువు లేకుండా పోతే కనీసం ఒక్క గిరిజన సంఘం కూడా స్పందించకపోవడం పై పలు ఆరోపణలతో పాటు అనుమానం వ్యక్తం చేస్తున్నట్లు పేర్కొంటున్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నారు. విద్యార్థులకు తమ హక్కు అయిన విద్యను అభ్యసించలేని స్థితికి చేరుకుంటున్నారు. ఒకపక్క విద్యార్థికి చదువు రాకఏమీ చేయాలోతెలియని స్థితిలో ఉండిపోతున్నారని తమ పిల్లల భవిష్యత్ ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నలు వేసుకుంటున్నారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే నేటి విద్యార్థి దశలోనే నాణ్యమైన విద్య అభ్యసిస్తేనే అవకాశాలు దొరుకుతాయని పలువురు పేర్కొంటున్నారు. జీలుగుమిల్లి మండలం లోని బర్రింకలపాడు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 5 నుండి 10వతరగతి వరకు 477 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. వీరికి విద్య నేర్పేందుకు ప్రభుత్వం 23 మంది ఉపాధ్యాయులను నియమించింది.ఈగురుకులానికి రెగ్యులర్ ఉపాధ్యాయులు లేకపోవడంతో



21 మంది ఉపాధ్యాయులను ఔట్సోర్సింగ్ పద్ధతిలో అధికారులు నియమించారు.ప్రస్తుతం ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయులు సమ్మెబాట పట్టారు. 477 మంది విద్యార్థులకు కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. వారిలో ఒకరు ప్రిన్సిపాల్, ఒకరు పి.డి, వీరితోనే గత 25 రోజులుగా పాఠశాలను నెట్టుకొస్తున్నారు.

**– పరీక్షలు పరిస్థితి ఏమిటి –** రెండు రోజుల్లో ఎస్ ఏ. 1, పరీక్షలు ఉన్నాయి. రాబోయే మూడు నెలల్లో 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు ఉన్నాయి. ఇప్పుడు రాసే ఎస్ఏ. 1 పరీక్షలకు సిలబస్ చెప్పాల్సిన ఉపాధ్యాయులు సమ్మెలో ఉండటంతో పరీక్షకు సంబంధించిన ఒక్క పాఠాన్ని కూడా బోధించలేదని విద్యార్థులు పేర్కొంటున్నారు. పరీక్షలలో సరైన మార్కులు రాకపోతే వారి మానసిక స్థితి ఎటువైపు దారితీస్తుందోనని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. గిరిజన విద్యార్థులే కదా వారికి పాఠాలు చెప్పకపోతే ఏమీ కాదులే అనే నిర్లక్ష్య ధోరణి ఉన్నత అధికారుల్లో కనిపిస్తుందని అంటున్నారు. ప్రస్తుత ఐటిడిఏ పీవో గా జిల్లా జాయింట్ కలెక్టర్ ఉన్నా పరిస్థితి ఇంతేనా అంటున్నారు. ఉన్నత చదువులు చదివిన అధికారులు కూడా విద్యార్థుల భవిష్యత్తు పైన దృష్టి సారించకపోవడం బాధాకరమని పేర్కొంటున్నారు. గురుకుల పాఠశాలల్లో చదివితే ఉన్నత స్థితికి చేరుకుంటారని అనుకున్నామే తప్ప పాఠాలు చెప్పే మాస్టర్లు కరువు అవుతారని అనుకోలేదని కన్నీటి పర్యంతం అమ్ముతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు పాఠాలను చెప్పేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై బర్రింకలపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వామిని వివరణ కోరగా ఉపాధ్యాయులు అందరూ సమ్మెలో ఉన్నట్లు తెలిపారు.

## బొర్రంపాలెంలో
# కాటన్ దొర ఆసుపత్రిచే వైద్య శిబిరం

**టి.నరసాపురం,మేజర్‌న్యూస్** : టి.నర్సాపురం మండలంలోని బొర్రంపాలెంలో జంగారెడ్డిగూడెంనకు చెందిన కాటన్ దొర ఆసుపత్రి ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసింది. శిబిరానికి వచ్చిన 220 మంది రోగులకు సాధారణ వ్యాధులకు, దంత వైద్యానికి వైద్యులు కాటన్ దొర, మల్లిక భార్గవి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు.



# ఆ పేద విద్యార్థులకు దారేది?

**కుక్కునూరు,మేజర్‌న్యూస్** : మండల పరిధిలోని సీతారామ నగర గ్రామంలో ఉన్నటువంటి హై స్కూల్ విద్యార్థులు గత కొంతకాలం నుండి ఇంగ్లీష్ తెలుగు హిందీ గణితం సబ్జెక్టులను బోధించడానికి ఉపాధ్యాయులు లేకపోవడంతో మా భవిష్యత్తు ఏమిటి అనే అయోమయ పరిస్థితిలో విద్యార్థులు ఉన్నారని, ఆ పేద విద్యార్థుల తల్లిదండ్రులు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మరాజుకు ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని ఈ విషయాన్ని ఉన్నత అధికారులకు తెలియజేయాలని వారు వినతి పత్రం అందజేశారు మా పిల్లలకు గత కొంతకాలం నుంచి ఉపాధ్యాయులు లేకపోవడంతో ఒకవైపు చదువు రాకపోవడం మరొకవైపు పని కూడా రాదేమో అని తల్లిదండ్రులు బాధపడుతున్నారు పోలవరం ముంపు మండలాలైన కుక్కునూరు, వేలూరుపాడు మండలాలపై అధికారులు సవతి తల్లిప్రేమ చూపెడుతున్నారని వాపోతున్నారు. పూర్తి స్థాయిలో అధికారులు ఉపాధ్యాయులను నియమించడం లేదని, 2014లో మా మండలాలు ఆంధ్రాలో విలీన మైనప్పటినుండి ఇదేపరిస్థితి కొనసాగు



తుందని,మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నామని, ఎవరికి చెప్పినా ఇదిగో చేస్తాము అని మాటలు చెప్పేవారు తప్ప చేతలు ఎక్కడా కనిపించడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా స్పందించి మా గ్రామంలో ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాలని వారు కోరు కుంటున్నారు.

## నూజివీడు అభివృద్ధికి
# సమిష్టి కృషి అవసరం

### - ఇంటిలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** నూజివీడు ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సమిష్టికృషి ఎంతోఅవసరం అని ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ఏబీ వెంకటేశ్వర రావు పిలుపునిచ్చారు. ఆదివారం నాడు స్థానిక ఎస్ ఆర్ ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల 1983–84 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధి గా పాల్గొన్న ఏబీ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ నాడు విద్యారంగం అభివృద్ధికి జామిందారులు ఎంతో కృషి చేశారని అన్నారు. విద్యారంగంలో నూజివీడు ప్రాంతానికి ఎంతోప్రాముఖ్యత వుందని చెప్పారు. ఈపాఠశాలలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థులు దేశవిదేశాల్లో ఉన్నతపదవులు అధిరోహించారని చెప్పారు. ఈపాఠశాలలో చదువుకున్న విద్యార్థులు నేడు ఆత్మీయ సమావేశం జరుపుకోవటం ఎంతో సంతోషం గా ఉందని అన్నారు. వేలాది మందికి ఈ పాఠశాల విద్యాదానం చేసిందని అన్నారు. ఎస్ ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధితో పాటు నూజివీడు ప్రాంత అభివృద్ధి కి మనమంతా సమిష్టి గా పనిచేద్దామని పిలుపునిచ్చారు. నాటి ఉపాధ్యాయలైన పీమ్ కృష్ణరావు, వైవి రాజు, ఎం నరసింహారావు, కలపాల ప్రసాదరావు, రాధాకృష్ణ, జానకి రామయ్య తదితరులను ఘనంగా సత్కరించారు. ఈ సమావేశం లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు గత స్మృతులు మననం చేసుకున్నారు. పాఠశాల ప్రాంగణాన్ని కలిగి చిన్ననాటి తీపి గుర్తులను పంచుకున్నారు.

# దివ్యాంగులకు స్ఫూర్తి దాతల సహకారం

### – హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.సత్యప్రసాద్



**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** పుట్టుకతో గానీ,ప్రమాదంలో గానీ శరీర అవయవాలు పోగొట్టుకున్న దివ్యాంగులకు దాతల సహకారం ఎంతో స్ఫూర్తి దాయకమని హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా.కోనేరు. సత్యప్రసాద్ అన్నారు. మండల పరిధి తోటపల్లి గ్రామ శివారులో గల హీల్ సంస్థలో ఆదివారం ధనశిక్ష చారిటీస్ సంస్థ సహకారముతో 15మంది దివ్యాంగ బాలలకు కృత్రిమ కాళ్ళను అందచేసిన సందర్భముగా ధనశిక్ష సంస్థ ప్రతినిధులను అయన అభినందించారు.వీరిలో ధనవంతులుగా వున్నవారు, ఇబ్బందులలో వున్నవారికి సహాయపడటానికే భగవంతుడు వారిని స్థితిమంతులుగా చేసాడని, గమనించి పరోపకారానికి పూనుకోవాల న్నారు. ధనశిక్ష సంస్థ డైరెక్టర్ ప్రజ్వల్ సుంద్రు మాట్లాడుతూ హీల్ సంస్థ సహకారముతో ఇప్పటి వరకు 28 మందికి కృత్రిమ కాళ్ళు అందచేశామ న్నారు. అంతేగాక మరికొంత మంది పేదవిద్యార్థుల ఉన్నత విద్యకు సహకరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమములో ధనశిక్ష సంస్థ ప్రతినిధులు సమీర్, లక్ష్మణ్, రితేష్, స్నేహిత్, ఖాదర్, హీల్ ప్రిన్సిపాల్ బి.సాయిబాబు, కృత్రిమ అవయవ కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 50 మంది వైఎస్ఆర్‌సీపీ
# కార్యకర్తలు టిడిపిలో చేరిక

**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** మండలంలోని కోడిగుడెం గ్రామంలో ఆదివారం ఉదయం 50 మంది వైఎస్ఆర్సిపి కార్యకర్తలు ఎన్డీఏ కూటమి



నాయకులు సమక్షంలో తెలుగుదేశం పార్టీలోచేరారు.ఈ కార్యక్రమానికి మండల క్లస్టర్ ఇన్చార్జి రేగంటి రాంబాబు ముఖ్యఅతిథిగా హాజరై వారందరికీ తెలుగుదేశం పార్టీ కండువా వేసి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు.ఈ క్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ‘కొట్టు’కు ప్రతికూలం - ‘వడ్డీ’కి అనుకూలం

## - అధిష్టానానికి తెలియజేస్తాం - పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు





**తాడేపల్లిగూడెం,మేజర్‌న్యూస్:** తాడేపల్లిగూడెంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు గుండుబోగుల నాగు మాట్లాడుతూ తమబాధ అంతా పార్టీ ఏమైపోతుందో అనేఅన్నారు. ఇటీవల పలువురు నాయకులు సమావేశాల్లో సన్నాసుల లాగా మాట్లాడుతున్నారని,నోటికొచ్చినట్లుగామాట్లాడితే సహించేవారు లేరన్నా రు. ఎక్కడినుంచో వచ్చి ఇక్కడ నాయకత్వం ఏంటని అడుగుతున్నారని, ఇప్పుడు ఉన్న నాయకులు ఎక్కడి నుండి వచ్చారో చూసుకోవాలన్నారు. ఎంపీపీ శేషులత మాట్లాడుతూ ముప్పిడి సంపత్ కుమార్ నీతి జాతి లేని వ్యక్తి అని తనను ఉద్దేశించి మాట్లాడటం చాలా బాధాకరమని అన్నారు. మహిళ అనికూడాచూడకుండాచాలా అవమానం చేసారని కన్నీటి పర్యంతమయ్యారు.నాకు ఎంపీపీగా పదవికోసండబ్బులు తీసుకున్నారన్నారు. దానికోసం అప్పుల పాలయ్యానని అన్నారు. జాతి కోసం మాట్లాడేముందు మీరు మేము ఒకే జాతి అనే విషయాన్ని గుర్తుపెట్టుకో వలన్నారు. చుండ్రు శ్రీను బాబు మాట్లాడుతూ వెలిశెట్టి నరేంద్ర తనపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని అతని వలన ఏమి అవ్వదని,మంత్రి పుణ్యమా అని సొసైటీ ప్రెసిడెంట్ అయ్యావని, మీ ఊర్లో రాజకీయం చేయలేని వ్యక్తి మా గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. నీ వెంట ఒక్కరు రారు. వెనుక టీడీపీ జెండా ముందు వైసీపీ కండువా కప్పుకున్న వ్యక్తి అని,నిన్ను ఎవరీ నమ్మరని మండి పడ్డారు. సర్పంచ్ లక్ష్మణరావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఎంతో నష్టపోయామన్నారు. ఆర్థికంగా నాశనమైపోతే మా గురించి మాట్లాడేందుకు రామకృష్ణ కు హక్కు లేదన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు మాట్లాడుతూ అసంతృప్తి పరులు, నష్టపోయిన వారు అంతా కలసి బాధలు చెప్పుకుంటే ముప్పిడి సంపత్ కుమార్ మేము పార్టీకి ద్రోహం చేస్తున్నారని అనడం మీ అవగాహన లేమికి అద్దం పడుతుందన్నారు. మేము వేరే పార్టీలోకి వెళ్తేనో, వెళ్లాలనే ఆలోచన చేస్తేనో ద్రోహం చేసినట్లు అవుతుంది కానీ మేము ఇప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నామన్నారు.

మేము ఇక్కడ నాయకత్వాన్ని మాత్రమే వ్యతిరేకిస్తున్నాం కానీ పార్టీని కాదన్నారు. ఆర్థికంగా నష్టపోయి ఆస్తులను అమ్ముకున్నామన్నారు. ఇక్కడ పరిస్థితి మాజీ సీఎం,వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మార్లపూడి సుబ్బారావు, కావులూరి వెంకన్న, ఆర్.లక్ష్మణరావు, వీరమల్ల వెంకన్న,నార్ని నాగు, సర్పంచ్‌లు ఎలిపే గాంధీ,చుండ్రు శ్రీనుబాబు, వైసీపీ నాయకులు గుండుమోగుల బలుసులరావు, వీర్ల గోవిందు, రాజా త్రినాధ్,నలిమిల్లి అంజిరెడ్డి, కండుబోయిన కృపావరం,నేదూరిగంగాధర్, శీలి వెంకటేశ్వర రావు, కాకర్ల శ్రీనివాస్, కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

# హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కలిగించాలి



పెనుగొండ,మేజర్‌న్యూస్: హిందూ దేవాలయాలను ప్రభుత్వ నియంత్రణ నుండి విముక్తి చేసి, స్వయం ప్రతిపత్తి కలిగిన ఒక ఉత్తమ ధార్మిక వ్యవస్థకు అప్పగిస్తూ వెంటనే చట్ట సవరణ చేయాలని శ్రీ సద్గురు గీతాశ్రమ పీఠాధిపతులు పూజ్యశ్రీ సత్యానందగిరి స్వామీజీ పేర్కొన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో వేంచేసి యున్న శ్రీ విజయ గోపాలస్వామి దేవస్థానం నందు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సంఘ మండల హిందూ సమ్మేళనం నిర్వహించబడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ సమాజ సంరక్షణయే దేశ శ్రేయస్సుయని, హిందుత్వానికి ఆలవాలమైన దేవాలయాలకు నేడు రక్షణ లేకుండా పోయిందని, దేవాలయ భూములు అన్యా క్రాంతమవుతున్నాయని, విగ్రహాలు ధ్వంసానికి గురవుతున్నాయని అన్నారు. దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. హిందువుల మనోభావాలను, సమస్యలను అర్థం చేసుకొని ప్రభుత్వాలు వెంటనే స్పందించాలనే లక్ష్యంతో విజయవాడలో జనవరి 5వ తేదీన తలపెట్టిన భారీ బహిరంగ సభ -హైందవ శంఖారావం కార్యక్రమాన్ని హిందూ బంధువులంతా లక్షలాదిగా పాల్గొని విజయ వంతంచేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ కార్యకారిణి సభ్యులు చింతాకుల గోపాలకృష్ణ, మండల కన్వీనర్ సానబోయిన ఉర్దన్య, దొడ్డిపట్ల నాగూరు, వంగూరి రామకృష్ణ,అకి సుబ్బారావు. ఎస్ఎస్ఎఫ్ మండల మహిళా కన్వీనర్ వెంకటలక్ష్మి, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు, హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు,హిందూ బంధువులు వివిధ గ్రామాల నుండి పాల్గొన్నారు.

# ఎక్సైజ్ మెరుపు దాడులు - నాటు సారా స్వాధీనం : కేసు నమోదు

**నూజివీడు,మేజర్‌న్యూస్** : ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ స్టేషన్ నందు ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ,ఎక్సైజ్, బి.శ్రీలత ఆదేశముల మేరకు, జిల్లా డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ ఆఫీసర్, ఏ.అవులయ్య ఆధ్వర్యంలో చాట్రాయి మండలం పోతనపల్లి చిన్న తండ వద్ద జరిపిన దాడులలో దారవతు రాము అనే అతనిని అదుపులోనికి తీసుకున్నారు. అతని వద్ద నుండి 120 లీటర్ల నాటు సారాం, 2 వాహనాలు స్వాధీన పరచుకున్నారు. నాటు సారా తయారికి సిద్దంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ద్వంసం చేసి దారవతు రాము. కు సారాయి తయారికి ఊపయోగించే నల్ల బెల్లంను సరఫరా చేస్తున్న బెల్లపు వ్యాపారి అయిన వజ్రపు రాంబాబు, అనే అతని పై కూడా కేసు నమోదు చేశారు. అనంతరం చాట్రాయి మండలం, పోతనపల్లి పెద్ద తండ లో జరిపిన దాడులలో సారాయి రవాణా చేయుచున్న దారవతు నాగ రాజు వద్ద నుండి 20 లీటర్ల నాటు సారా,సారా రవాణా చేయుచున్న బైక్ ను కూడా స్వాదిన పరుచుకున్నారు. ఆదివారం జరిపిన దాడులలో మొత్తం 140 లీటర్ల నాటు సారా,3 వాహనాలు, 600 లీటర్ల బెల్లపు ఊటను ద్వంసం చేసి 3 నిందితుల పై కేసు నమోదు చేసినట్లు డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఆఫీసర్,ఏ.అవులయ్య తెలిపారు. ఈదాడులలో జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్,ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఇఎస్‌టిఎఫ్ జి.పాండు రంగా రావు,ఇన్స్పెక్టర్ ఏ.మస్తానయ్య,ఇఎస్‌టిఎఫ్, సబ్-ఇన్స్పెక్టర్ కే.యండి. అరీఫ్,నూజివీడు సబ్-ఇన్స్పెక్టర్ యం. ప్రసాద్, ఇఎస్‌టిఎఫ్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



# మామిడి పంటకు బీమా సౌకర్యం

## - ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** మామిడి రైతులకు ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. మామిడి పంటలు కూడా బీమా సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మామిడి పంటకు బీమా సౌకర్యం లేకపోవడంతో రైతులు ఆర్థికంగా పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత కొద్ది సంవత్సరాల నుండి ప్రతి ఏటా మామిడికాయలు పలు ఆటుపాట్లతోనష్టపోతున్నారు.వీరి బాధల ను గుర్తించిన ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురంలో 15 శాతం, ఎన్టీఆర్, కాకినాడ, వైస్సార్ ,అన్నమయ్య,విజయనగరం,నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో 16.7 శాతం, శ్రీకాకుళం, శ్రీసత్యసాయి, తిరుపతి, తూ.గో జిల్లాల్లో 17.74 శాతం , నంద్యాల, అనకాపల్లి, ఏలూరు జిల్లాల్లో 16.08 శాతం చొప్పున సగటు ప్రీమియంగా నిర్ణయించారు. రుణాలు తీసుకునే వారితో పాటు లేని వారికీ స్వచ్ఛందంగా బీమా అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# 25 లీటర్ల నాటు సారా స్వాధీనం : కేసు నమోదు



**టి.నరసాపురం,మేజర్‌న్యూస్** : ప్రొహిబిషన్,ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్, డిస్ట్రిక్ట్ ప్రొహిబిషన్,ఎక్సైజ్ ఆఫీసర్ ఏలూరు జిల్లా వారి ఆదేశాలు ప్రకారం చింతలపూడి ప్రొహిబిషన్ ,ఎక్సైజ్ స్టేషన్ పరిధి లో గల టి.నరసాపురం మండలం ఏపిగుంట గ్రామంలో నాటు సారాయి స్థావరాల పై దాడులు నిర్వహించగా ఏపిగుంట గ్రామమునకు చెందిన పాయం వేంకటేశ్వర రావు అను వ్యక్తి వద్ద నుండి 25 లీటర్ల నాటు సారాని స్వాధీన పరుచుకున్నారు. అతనిని అదుపులో తీసుకొని నాటు సారా తయారీకి పనికి వచ్చే 10 ప్లాస్టిక్ డ్రమ్ములలో నిల్వ ఉంచిన సుమారు 100 లీటర్ల పరిమాణము లో ఉన్న బెల్లపు ఊటను పూర్తిగా ధ్వంసం చేసి, అతనిపై స్థానిక ఎక్సైజ్ స్టేషన్ చింతలపూడి నందు కేసు నమోదు చేశారు.ఈ దాడులలో స్థానిక ఎక్సైజ్ ఎస్.ఐలు ఆర్.వి.ఎల్. నరసింహారావు ,అబ్దుల్ ఖలీల్,సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సి.ఐ పి.అశోక్ తెలిపారు.

# లక్ష్మీ నరసింహ స్వామి అన్న ప్రసాదం ట్రస్ట్‌కు రూ.1లక్ష విరాళం



**ద్వారకాతిరుమల,మేజర్‌న్యూస్:** చిన్న వెంకన్న ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి శాశ్వతం అన్నదాన ప్రసాదం ట్రస్ట్‌కి జంగారెడ్డి గూడెం గ్రామానికి చెందిన నిడమర్తి నాగ విజయలక్ష్మి రూ.1లక్ష రూపాయలు విరాళాన్ని ఆలయ సిబ్బందికి అందజేశారు.దాతకు సిబ్బంది బాండు పత్రాలను,ప్రసాదాలను,అందించి అభినందనలు తెలిపారు.

# యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

## - ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ వైబికే మార్టేరు వారి ఆధ్వర్యంలో, మార్టేరులో ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల సీనియర్ బాస్కెట్ బాల్ 10.వ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ ఎమ్మెల్యేకప్ ఫైనల్ కు ముఖ్య అతిధిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, నర్సాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్‌పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో మరో ముఖ్య అతిధిలు ఆచంట శాసన సభ్యులు పీతాని సత్య నారాయణ, తణుకు శాసన సభ్యులు అరిమిల్లి రాధాకృష్ణలతో కలిసి క్రీడాకారులను పరిచయం చేసుకుని వారిని ప్రోత్సహించారు. ఆదివారం జరిగిన ఈకార్యక్రమంసందర్భంగా ప్రభుత్వ విప్ నాయకర్ మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని,యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని అన్నారు. క్రీడలలో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని ఎమ్మెల్యే నాయకర్ అన్నారు. ఈ ఎమ్మెల్యే కప్ బాస్కెట్ బాల్ టోర్నమెంట్ ను ఇంత ఘనంగా నిర్వహించిన స్థానిక శాసన సభ్యులు పితాని సత్యనారాయణ కృషి అమోఘమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు వలవల నాని, నిప్పులేటి తారక రామారావు, గుబ్బల మార్రాజు,బందెల రవీంద్ర,మైలశివ కుమార్, వట్టిప్రోలు సతీష్, గ్రంధినాని, గన్నాబత్తుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు సీసీటీవీలు అమర్చుకోవాలి

## - దొంగతనాల నివారణకు అప్రమత్తంగా ఉండాలి



**నూజివీడు,మేజర్‌న్యూస్ :** ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై నూజివీడు డిఎస్పీ కె.వి.వి.ఎన్.వి ప్రసాద్,నూజివీడు టౌన్ ఇన్స్పెక్టర్ సత్య శ్రీనివాస్,ఎస్సై జ్యోతి పట్టణం ఎంప్లాయిస్ కాలనీ నందు ఆదివారం దొంగతనాల నివారణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి కాలనీ వాసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఇళ్ల వద్ద సీసీటీవీ లను ఏర్పాటు చేసుకోవాలని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తక్కువ రేట్ లో సీసీటీవీ లు నెల రోజులు పాటు బ్యాక్ అప్ కలిగి ఉండేలాగా కరెంటు తోను లేదా సోలార్ తోను పనిచేసేవి బహిరంగ మార్కెట్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఒక సీసీటీవీ ఉంటే 10 మంది పోలీస్ వారు కాపలా ఉన్నట్లుగానే భావించాలని, ప్రతి ఒక్కరూ సీసీటీవీలో లింకులను పోలీస్ స్టేషన్‌కు అనుసంధానంచేస్తే పోలీసు వారి పర్యవేక్షణ ఉంటుందని, ప్రస్తుతం సీసీటీవీల వైపే ద్వారా మన సెల్ ఫోన్‌లో కూడా అలారం సిస్టానికి అనుసంధించవచ్చని ప్రతి ఒక్కరూ సీసీటీవీని వారి ఇంటి లోపల పెట్టడం వలన దర్యాప్తు సమయంలో కొన్ని ఇబ్బందులను చవిచూడవలసి వస్తుందని ప్రతి ఒక్కరూ వారి ఇంటికి బయట ఇరువైపులా కనిపించే విధంగా సీసీటీవీ లను అమర్చుకోవాలని కోరారు. ఎవరైనా బయట ఊర్లకు వెళితే పోలీసువారికి సమాచారాన్ని అందించిన ఆ ఇంటిని పోలీసు వారి పర్యవేక్షణలో ఉంటుందని పోలీసు వారికి తెలియజేస్తే లాక్‌డ్ హౌస్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా తాళం వేసి ఉన్న ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలిస్తారని మీ మీ ప్రాంతాలలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే డయల్ 112 కు సమాచారం అందించని ఎడల వారి వివరాలను గురించి పోలీసు వారు తెలుసుకుంటారని అన్నారు.

ఈడి అధికారులని సిబిఐ అధికారులు మని చెప్పి ఫోన్ చేసి మీ పేరు డ్రగ్స్ కలిగినటువంటి పార్సల్ వచ్చిందని దానిపై మీపై కేసు పెట్టామని చెప్పి మీకు ఫోన్ చేసి డబ్బులు కడితే కేసులు తీసివేస్తామని వచ్చే బెదిరించి కావాల్సిన పట్ల వెనువెంటనే 1930కి కాల్ చేయాలని డిఎస్‌పి తెలిపారు.

# లారీ ఢీకొని ఇద్దరి మృతి

## - కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు





**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్:** ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం నారంవారి గూడెం గ్రామ శివారులో ఆదివారం జరిగింది.ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు వ్యక్తులు పోలవరం నియోజకవర్గంజీలుగుమిల్లిమండలం పి అంకంపాలెం గ్రామానికి చెందిన పేరా బత్తుల మనోజ్, బద్దే వెంకటేశ్వరరావుగా గుర్తించారు. రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు వ్యక్తులు మరణించిన విషయాన్ని తెలుసుకున్న పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఓ ప్రైవేటు కార్యక్రమంలో నుండి హుటాహుటిన అశ్వరావుపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబాలకు కూటమి ప్రభుత్వం తాను ఎప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. గ్రామానికి చెందిన యువకుడు అందరితో కలిసి తిరిగే మనోజ్ మరణ వార్త విని పరిసర గ్రామాల ప్రజలు శోక సముద్రంలో మునిగారు మనోజ్ స్నేహితులు 'నీ స్నేహం ఇలా ఆగిపోతుంది అనుకోలేదు మళ్లీ జన్మ అంటూ ఉంటే మన స్నేహం పూర్తిగా ఉండాలి వెలకట్టలేని స్నేహం ఇలా అర్ధాంతరంగా ముగిసిపోతుంది అనుకోలేదు రా బావ' అంటూ వారు పెట్టిన పోస్టులు కంటతడి పెట్టిస్తున్నాయి. వీరితోపాటు జీలుగుమిల్లి మండల అధ్యక్షులు పసుపులేటి రాము, కుక్కునూరు మండల అధ్యక్షులు ములిశెట్టి యుగంధర్,ములిశెట్టి నాగు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గర్భస్థ శిశువు గుండె,గర్భస్రావాల పరిశీలనపై అవగాహన

## -దిండిలో 'గుస' రాష్ట్రస్థాయి సిఎమ్ఈ సదస్సు




**మల్కిపురం/భీమవరం, మేజర్‌న్యూస్ :** అల్ట్రా సౌండ్‌లో వస్తున్న అత్యాధునిక పరిజ్ఞానంపై వైద్యులు అవగాహన పెంచుకునేందుకు కాన్ఫరెన్స్‌లు దోహదపడతాయని పలువురు వైద్య నిపుణులు పేర్కొన్నారు. గోదావరి అల్ట్రా సోనాలజిస్ట్స్ అసోసియేషన్ (గుస) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నాల్గవ సిఎమ్ఈ (నిరంతర వైద్య విద్యా) కాన్ఫరెన్స్ డా.చేగొండి వెంకట నారాయణరావు అధ్యక్షతన సరోవర్ పోర్టికో,దిండి, కొనసీమ జిల్లాలో ఆదివారం ఘనంగా జరిగింది. స్త్రీ ,ప్రసూతి వైద్య అల్ట్రాసౌండ్ రంగంలోని తాజా పరిజ్ఞానం, ప్రయోగాత్మక నైపుణ్యాలపై ఈ కాన్ఫరెన్స్‌లో వక్తలు డా.టీ.ఎల్.ఎన్. ప్రవీణ్,డా.శ్రీదేవి, డామృణాళిని, డా.ఎన్‌విఎస్ నాయుడు ప్రసంగించారు. కార్యక్రమంలో టిఫ్ఫా స్కానింగ్, గర్భస్థ శిశువుగుండె పరిశీలన, ట్రాన్స్‌వజైనల్ స్కాన్‌లు,ప్లాసెంటా మూల్యాంకనం వంటి ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు గర్భస్రావాల పరిశీలన, వివిధ వికృతుల (అవయవాల్లో అసహజ మార్పులు) విశ్లేషణపై నిపుణులు విశేష అవగాహన కల్పించారు. గుస వ్యవస్థాపక కార్యదర్శి డా.చేగొండి వెంకట నారాయణరావు మాట్లాడుతూ, '2002 నుండి గుస గోదావరి ప్రాంతంలో అల్ట్రాసౌండ్ రంగంలో ఎన్నో ఆవిష్కరణలను తీసుకువచ్చింది. ఈ కార్యక్రమం ద్వారా నూతన శాస్త్ర పరిజ్ఞానాన్ని అందరికీ అందించడమే మా లక్ష్యం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుస ప్రెసిడెంట్ డా.ఏ.రామకృష్ణ, ట్రెజరర్ డా.రాజ్యలక్ష్మి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖ ప్రసూతి వైద్య నిపుణులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పోలీసుల చర్యలు





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నేషనల్ హైవే, స్టేట్ హైవే ,ఇతర రహదారి మార్గాలలో రాత్రి వేళల్లో బస్టాండ్లో రైల్వేస్టేషన్లో ఒంటరి మహిళలకు రక్షణ కల్పిస్తూ పకడ్బందీగా గస్తీ విధులు,రహదారి ప్రమాదాల నివారణ కొరకు రాత్రిపూట వాహనదారులకు ఫేస్ వాష్ కార్యక్రమాలను ,బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటున్న జిల్లా పోలీసు యంత్రాంగం నేర నియంత్రణ చర్యలు చేపట్టింది.జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలతో ఏలూరు,జంగారెడ్డి గూడెం,పోలవరం,నూజివీడు సబ్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పూట గస్తీ విధులు జిల్లా పోలీసులు నిర్వహిస్తున్నారు. అధికారులు,సిబ్బంది వాహన తనిఖీలు నిర్వహించి వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి గంజాయి,నాటు సారా ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా జరగకుండా అరికట్టే చర్యలు తీసుకుంటున్నారు. అధికారులు అందరూ జిల్లా వ్యాప్తంగా ముమ్మర వాహన తనిఖీలు నిర్వహించారు. ఎటిఎం, దేవాలయాలు, చర్చిలు, మసీదులు వద్ద అప్రమత్తంగా తిరుగుతూ,అనుమానిత వ్యక్తుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.రాత్రి వేళల్లో లాడ్జిలో రైల్వే, బస్సు సేషన్లో కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అనుమానిత వ్యక్తులని ప్రశ్నిస్తున్నారు.ఎటువంటి నేరాలు జరగకుండా జిల్లా పోలీసులు గస్తీ తిరుగుతు నేర నియంత్రణ చర్యలు తీసుకుంటున్నారు.

# ప్రణాళికతో గృహ నిర్మాణ లక్ష్యాలు సాధించాలి

## -అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి కొలుసు పార్థసారథి



**నూజివీడు,మేజర్‌న్యూస్** : ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణంలో పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని రాష్ట్ర గృహనిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. ఆదివారం నూజివీడు ఆర్అండ్‌బి విశ్రాంత భవన సమావేశ మందిరంలో గృహనిర్మాణ పనులు ప్రగతిపై హౌసింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి పేదవారికి ఇల్లు ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ప్రణాళిక బద్ధంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిబద్ధతతో పనిచేయాలన్నారు. గతంలో తాము ఇచ్చిన వంద రోజుల ఇళ్ల నిర్మాణ స్కీం టార్గెట్ ఎందుకు పూర్తి చేయలేక పోయారని అధికారులను నిలదీశారు. నిర్దేశించిన సమయానికి ఇళ్ల నిర్మాణ పనులు పూర్తి చేయకపోతే తగిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. జిల్లాలో ఎన్ని ఇళ్ళు నిర్మించారు, ఇంకా ఎన్ని నిర్మించవలసి ఉంది అని మంత్రి ప్రశ్నించగా సమగ్ర వివరాలు అధికారుల దగ్గర లేకపోడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందజేయకపోతే అంతిమంగా లబ్ధిదారుడు నష్టపోతాడని ఇచ్చిన టార్గెట్ నిర్ణీత సమయంలో పూర్తి చేయడంలో అలసత్యం ,నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడి నగదు సకాలంలో అందించాలని సరైన సమయంలో సొమ్ము అందకపోతే ఇళ్ళు నిర్మించే లబ్ధిదారుడు నష్టపోతాడని ఏ ఒక్క లబ్ధిదారుడు నష్టపోకుండా చూసే బాధ్యత మీదేనన్నారు. జిల్లా గృహనిర్మాణ ప్రాజెక్ట్ డైరెక్టర్, అసిస్టెంట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లు, అందరూ కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమన్వయంతో అందరూ కలసి పనిచేసి మీకు ఇచ్చిన టార్గెట్ను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని గృహనిర్మాణశాఖ అధికారులను ఆదేశించారు.

# ఏలూరులో అమానవీయ ఘటన

## - లూసీ హాస్టల్‌లో అపుడే పుట్టిన ఆడపిల్ల మృతదేహం




**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఏలూరు అశోక్ నగర్ సెంట్ జోసఫ్ కాన్వెంట్ రిలీజియస్ టీచర్స్ ఆఫ్ సెయింట్ లూసీ హాస్టల్‌లో అపుడే పుట్టిన ఆడపిల్ల మృతదేహం. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని తోటి విద్యార్థుల సహాయంతో ప్రసవం చేయించుకుని ప్రసవానంతరం నవజాత శిశువును తాము ఆశ్రయం పొందుతున్న సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ వసతిగృహం నుండి పక్కనే ఉన్న మరొక ఇంట్లోకి విసిరి వేసిన వైనం. ఈ అమానవీయ ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ప్రసవించిన విద్యార్థిని దైవ సేవకు అంకితమయ్యే స్త్రీలు ఉండే వసతి గృహంలో ఆమె ఉండడం గమనార్హం పోలీసులు ఈ కేసును అన్ని కోణాల్లో క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు.ఏలూరు డిఎస్‌పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ బృందాలు రంగ ప్రవేశం చేశాయి. ఘటనకు సంబంధించి వివరాలు రెండవ పట్టణ పోలీసులు,డిఎస్పీ ,క్లూస్ టీం సేకరిస్తున్నారు.

## పేకాట శిబిరంపై దాడి : ఏడుగురు అరెస్ట్



జంగారెడ్డిగూడెం మేజర్‌న్యూస్ : జంగారెడ్డి గూడెం డిఎస్పి యు రవిచంద్ర, ఇన్స్పెక్టర్ కృష్ణ బాబు ఆదేశాలపై లక్కవరం ఎస్ఐ రామకృష్ణకి రాబడిన సమాచారం మేరకు లక్కవరం ఎస్ఐ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. ఆదివారం లక్కవరం గ్రామంలో పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని,వారి వద్ద నుండి 4,300 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. వారిపై లక్కవరం పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లుగా ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా లక్కవరం ఎస్సై మాట్లాడుతూ లక్కవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా అసాంఘిక కార్య కలాపాలకు గాని, జూద కార్యకలాపాలకు గాని, పేకాట కోడిపందాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా కోడిపందాలు పేకాటల సమాచారాన్ని డయల్ 112 కు లక్కవరం ఎస్ఐ నెంబర్ 9440796629 కు సమాచారాన్ని అందించాలని కోరారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలి





## - దేశం నలుమూలల నుండి వచ్చిన 130 మంది కతోలిక న్యాయవాదులకు ఆర్సిఎం పీఠాధిపతి పొలిమేర జయరావు ఉద్బోధ

**పెదవేగి,మేజర్ న్యూస్:** దేశవ్యాప్తంగా కతోలిక న్యాయవాదులంతా భారత రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాలని ఆర్‌సిఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఉద్బోధించారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం సెయింట్ జోసెఫ్ డెంటల్ కళాశాలలో గత 3 రోజులుగా జరిగిన కతోలిక న్యాయవాదుల ముగింపు సమావేశంలో ఆదివారం బిషప్ ప్రసంగించారు.ఈసందర్భంగా పీఠాధిపతి పొలిమేర జయరావు మాట్లాడు తూ న్యాయవాదులంతా నిబద్ధత కలిగి ఉండాలని, శాంతి, న్యాయం కోసం అహర్నిశలు శక్తి వంచన లేకుండా కృషి చేయాలి అన్నారు. భారత రాజ్యాంగం 75సంవత్సరాల చరిత్రలోఈఏడాదిఅత్యంత ప్రాముఖ్యమై నదిగా అభివర్ణించారు.న్యాయవాదులయినగురువులు,కన్యా స్త్రీలు రాజ్యాంగం పట్లఅవగాహనపెంపొందించు కోవాలని బిషప్ సూచించారు. దేశవ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు నిర్వహించడం ద్వారా రాజ్యాంగ స్ఫూర్తిని ఇనుమడింప చేసుకోవాల్సిన అవసరం న్యాయవాదులుగా ప్రతి ఒక్కరిపై గురుతర బాధ్యత ఉందని బిషప్ జయరావు పేర్కొన్నారు. ఈ న్యాయవాద సదస్సుకు దేశవ్యాప్తంగాహాజరైన130మంది న్యాయవాదులు, సిస్టర్లకు, జడ్జిలకు, సుపీరియర్లుకు పిఆర్వో ఫాదర్ టి ఇమ్మానుయేల్, నిర్వహణ బృందం ఫాదర్లు ఫాదర్ జి. మోజెస్,ఫాదర్ బాల, ఫాదర్ ఇంజె పాల్, ఫాదర్ జాకబ్,ఫాదర్ బాబు జార్జి కృతజ్ఞతలు తెలిపారు.

# నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు







**ద్వారకతిరుమల,మేజర్‌న్యూస్:**చిన్న వెంకన్న ఆలయ ఒకుళ్ళమాత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఆదివారం ఉదయం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు విరాళాలను సమర్పించారు. నల్లజర్ల గ్రామానికి చెందిన గంటా త్రివిక్రమ్ రూ1లక్ష 116లు, తణుకు పట్టణానికి చెందిన ఉమ్మా శ్రావణ కుమార్ రూ1లక్ష116లు, ప్రకాశం జిల్లా దుద్దుకూరు గ్రామానికి చెందిన ఎం వెంకటేష్ రూ1లక్షలు విరాళాలను అందించారు. దాతలకు ఆలయ సూపరింటెండెంట్ హైగ్రీవాచారి బాండు పత్రాలను, స్వామివారి ప్రసాదాలను అందించి అభినందనలు తెలిపారు.

## ఎన్ఎంఎంఎస్ 2,560 మంది విద్యార్థులు హాజరు

**భీమవరం,మేజర్‌న్యూస్:** 2024-2025 విద్యా సంవత్సరం ఆదివారం 8న జరిగిన నేషనల్ మీన్స్- కమ్-మెరిట్ స్కాలర్షిప్ పరీక్షకు (ఎన్ఎంఎంఎస్) 2,683 మంది విద్యార్థులకు గాను 2,560 మంది విద్యార్థులు హాజరయ్యారు. కాగా 123 మంది విద్యార్థులు గైరుహాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను జిల్లా విద్యా శాఖాధికారి, ఫ్లయింగ్ స్క్వాడ్ 2 రెవెన్యూ డివిజన్ నందు 12 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని, జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి ఇ.వి.వి.ఎన్.ఎస్.ఎస్. ఎస్.బి.ఎల్. నారాయణ తెలియజేశారు.

# నేడు జిల్లా వ్యాప్తంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ" కార్యక్రమం మండల, డివిజనల్, మున్సిపల్ స్థాయిలో ఈనెల 9వ తేదీ సోమవారం నుండి అమలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ సెల్వి ఆదివారంఒకప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ను సోమవారం నుండి మండల, డివిజనల్ మ మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు మండల,డివిజనల్, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామని కలెక్టర్ అన్నారు.అర్జీదారులు ఈవిషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోనిమండల కార్యాలయాలు,డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు .ప్రజలకి పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల,డివిజనల్ మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీ కరించినట్లు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.